





కలెక్టర్ ప్రావీణ్యతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి, నిర్మల



కలెక్టర్, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి డంప్‌యార్డు ఆధునీకరణపై

కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో జగ్గారెడ్డి, నిర్మల సమీక్ష

రూ.18 కోట్ల హెచ్ఎండీఏ నిధులు మంజూరు చేయిస్తానన్న జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో డంపింగ్‌యార్డు ఆధునీకరణ కోసం రూ. 18 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ అధికారులతో శనివారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపాలిటీ డంప్‌యార్డు సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానన్నారు. చెత్తను సెగ్రిగేట్ చేయడానికి ఉన్న టెక్నాలజీ, డీపీఆర్ సిద్ధంగా ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. చెత్తను శుద్ధి చేసేందుకు హెవీ మిషనరీ అవసరం పడుతుందని జగ్గారెడ్డికి అధికారులు తెలిపారు. డంప్ యార్డులో చెత్తను శుద్ధి చేసేందుకు అవసరమైన నిధులు తెచ్చేందుకు తాను కృషి చేస్తానని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను జగ్గారెడ్డి కోరారు. సమీక్ష సమావేశంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.





తాగు నీటిలో పడిన ఎలుక, ఆస్పత్రిలో చిన్నారులు

అంగన్‌వాడీ సెంటర్‌లో తాగునీటిలో ఎలుక

అదే నీటిని చిన్నారులకు తాగించిన ఆయా

వైద్యుల పర్యవేక్షణలో 8 మంది చిన్నారులు

శివ్వంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు తాగే నీటిలో ఎలుక పడి చనిపోగా.. అదే నీటిని ఆయా పిల్లలకు తాగించింది. ఆలస్యంగా గమనించి ఎలుకను నీటి బిందెలో నుంచి తీసి పడేయగా అది గమనించిన తల్లిదండ్రులు పిల్లలను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం రత్నాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా రాజమ్మ శనివారం రోజూ మాదిరిగానే సెంటర్‌కు వచ్చిన ఎనిమిది మంది పిల్లలకు పోషకాహారం తినిపించి బిందెలో ఉన్న నీటిని తాగించింది. బిందెలో రెండ్రోజుల క్రితం తెచ్చిన నీటిలో సెండెలుక పడి చనిపోగా గమనించకుండా అందులోనే మళ్లీ తీసుకువచ్చింది. చిన్నారులు నీటిని తాగిన తరువాత బిందెలో ఎలుక ఉందని గమనించి తీసి బయట పడేసింది. విషయం తెలుసుకున్న చిన్నారుల తల్లిదండ్రులు వారిని హుటాహుటిన నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్, ఆయాలు నిర్లక్ష్యం గా చిన్నారులకు కలుషిత నీటిని తాగించారని, వారికేమైనా అయితే ఎవరు బాధ్యులని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన చేశారు. ఈ విషయంపై నర్సాపూర్ సీడీపీవో హేమ భార్గవిని వివరణ కోరగా చిన్నారులు నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, రెండు రోజులు చిన్నారుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాల్సి ఉంటుందని వైద్యులు సూచించారని తెలిపారు. విద్యార్థులు ఇంటి నుంచే నీటిని తెచ్చుకుంటారని ఆమె చెప్పడం గమనార్హం.

కోటా వచ్చింది

- వచ్చే నెల 1 నుంచి రేషన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు
- సంగారెడ్డి జిల్లాలో 4,10,652 రేషన్‌కార్డులు
- వచ్చే నెల కోటా 87,359.64 మెట్రిక్ టన్నులు
- 29,635 కొత్త రేషన్‌కార్డులు
- 67,208 మంది సభ్యుల చేర్పు



సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ కోటా వచ్చింది. వచ్చే నెల నుంచి కొత్త రేషన్‌కార్డుదారులకూ సన్న బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. గత మూడు నెలలుగా చాలామందికి కార్డులు మంజూరైనా కోటా కేటాయించకపోవడంతో సన్న బియ్యం పంపిణీ చేయలేదు. జూన్‌లో మూడు నెలల బియ్యం ఒకేసారి అందజేశారు. కార్డు వచ్చినా బియ్యం కోటా రాకపోవడంతో ఇవ్వలేదు. వచ్చే నెలకు సంబంధించి సర్కారు బియ్యం కోటా కేటాయించడంతో కొత్త, పాత కార్డుదారులందరికీ సెప్టెంబరు నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు.

846 రేషన్ దుకాణాలు

సంగారెడ్డి జిల్లాలో గతంలో జిల్లాలో 3,81,017 రేషన్ కార్డులుండగా, 13,08,489 సభ్యులున్నారు. కొత్తగా 29,635 రేషన్ కార్డులు జారీ చేయడంతో లబ్ధిదారు సంఖ్య 13,70,796కు చేరుకుంది. వచ్చే నెలకు సంబంధించి రేషన్ కోటా 87,359.64 మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కేటాయించింది. ఇలా ఉండగా రేషన్ సన్నబియ్యంతో పాటు కార్డుదారుడికి ఒక ప్రత్యేక బ్యాగు ఇవ్వనున్నారు. ఇప్పటికే 4,12,411 బస్తాలు జిల్లాకు చేరుకున్న విషయం తెలిసిందే.

కొత్త కార్డులకూ రేషన్



రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రేషన్ కార్డుల మంజూరు, కేటాయించే కోటా ఆధారంగా రేషన్ సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేస్తాం. ఈసారి జిల్లాలో కొత్తగా మంజూరైన కార్డులతో పాటు, పాత కార్డుల్లో కొత్తగా చేర్చిన సభ్యులకూ కోటా వచ్చింది. వచ్చే మూడు నెలలకు సంబంధించి సెప్టెంబరు 1 నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తాం.

-జి.బాలసరోజ, సంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల అధికారి

లక్ష్యం.. దూరం



- అంచనా చేరుకోని వరి నాట్లు
- 27 వేల ఎకరాలు తక్కువగా..
- వర్షాలు ఆలస్యం.. మించిపోయిన సమయం
- సీజన్ ప్రారంభమై రెండు నెలలు
- ప్రారంభం కాని పంటల నమోదు
- అందుబాటులోకి రాని యాప్

మెదక్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మెతుకుసీమలో ఈ వానాకాలం పంటల సీజన్‌లో వరిసాగు లక్ష్యానికి దూరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. 2025- వానాకాలం సీజన్‌లో 3.05 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తారని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. సాధారణంగా సీజన్ జూన్ 12న ప్రారంభమవుతుంది. జూలై నెలలో జిల్లాలో వరి నాట్లు ప్రారంభించి ఆగస్టు 15 వరకు పూర్తిచేస్తారు. కానీ ఈ సారి వర్షాలు ఆలస్యంగా కురియడం మూలంగా నాట్లు ఆలస్యమయ్యాయి. రెండు వారాల క్రితం వాతావరణం వేసవిని తలపించింది. భూగర్భ జలాలు లోతుకు చేరి పంటలకు నీరందక రైతులు అందోళనచెందారు. గత వారం జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురియడంతో పరిస్థితి మారిపోయింది. జలాశయాలు, బోర్లు, బావులు కళకళలాడుతున్నాయి. కానీ, వరి నాట్లకు సమయం మించిపోవడం, నారు అందుబాటులో లేకపోవడంతో రైతులు వరి నాట్లు వేసుకోలేకపోయారు.

2.78 లక్షల ఎకరాల్లో నాట్లు

జిల్లావ్యాప్తంగా 2.78 లక్షల ఎకరాల్లో నాట్లు వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. అంచనాల కంటే ఇది 27 వేల ఎకరాలు తక్కువ. వర్షాలు సక్రమంగా కురిసినా సాగునీటికి ఇబ్బందులు లేకపోయినా వరి సాగు లక్ష్యాన్ని చేరుకోలేదు. నాట్లు పూర్తయినా ఈసారి పంటల నమోదు యాప్ ఇంకా అందుబాటులోకి రాలేదు. సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు గడుస్తున్నా పంటల నమోదు చేయలేకపోతున్నారు. దీంతో పంటల బీమా, సబ్సిడీ, రైతు భరోసా వంటి పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం లేకుండా పోతున్నది. కచ్చితమైన పంటల వివరాలు అందుబాటులో లేకపోవడంతో ఎరువులు, విత్తనాల పంపిణీలో గందరగోళం ఏర్పడుతున్నది.

త్వరలోనే పంటల నమోదు

పంటల నమోదు యాప్ త్వరలోనే అందుబాటులోకి వస్తుంది. అన్ని మండలాల్లో నమోదు ప్రక్రియను సమయానికి పూర్తిచేస్తాం. ఇప్పటి వరకు జిల్లాలో 2.78లక్షల ఎకరాల్లో వరి, 2,572 ఎకరాల్లో మొక్కజొన్న, 34,283 ఎకరాల్లో పత్తి, 880 ఎకరాల్లో పెసర, 1,183 ఎకరాల్లో మినుము, 956 ఎకరాల్లో కంది, 62 ఎకరాల్లో జొన్న, 3,896 ఎకరాల్లో ఇతర పంటలు సాగుశారు.

-దేవ్‌కుమార్, డీఏవో, మెదక్ జిల్లా



ఇంటర్‌లో ముఖ హాజరు ప్రారంభం

- తొలిరోజు 60 శాతం నమోదు
- సర్వర్ సమస్యలతో ఇబ్బందులు

మెదక్ అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో ఫేషియల్ రికగ్నేషన్ హాజరు(ఎఫ్ఎస్ఆర్)ను ప్రభుత్వం ప్రారంభించింది. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా అడుగులు వేస్తోంది. మొన్నటి నుంచి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఎఫ్ఎస్ఆర్ అమలు చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థుల హాజరు నమోదుకూ శనివారం నుంచి ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానం ప్రారంభమైంది. మెదక్ జిల్లా వ్యాప్తంగా 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో ప్రథమ సంవత్సరంలో 2,287 మంది, ద్వితీయ సంవత్సరంలో 3,220 మంది విద్యార్థులు చదువుతున్నారు. తొలిరోజు 60 శాతం మంది విద్యార్థుల హాజరు నమోదు చేశారు. సర్వర్ సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఒక కళాశాలలో అడ్మిషన్ తీసుకొని, కొన్ని కారణాలతో మరొక కాలేజ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు సాంకేతిక సమస్య కారణంగా ఇబ్బందుల తలెత్తాయి. మధ్యాహ్నం వరకు విద్యార్థుల హాజరు నమోదు కోసం అధ్యాపకులు ఫోన్లతో కుస్తీ పట్టారు.

ఎస్సీ వసతి గృహాలకు రూ.3.3 కోట్లు

సంగారెడ్డి జిల్లాలో 33 హాస్టళ్లకు మహర్దశ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల భవనాల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 48 ఎస్సీ వసతి గృహాలుండగా, ప్రభుత్వ పక్కా భవనాల్లో కొనసాగుతున్న 33 హాస్టళ్లకు మాత్రమే రూ.10 లక్షల చొప్పున రూ.3.3 కోట్ల నిధులు విడుదల చేసింది. అయితే టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి మరమ్మతు పనులు చేపట్టనున్నారు. సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్, కంపౌండ్ వాల్, బాత్రూమ్, టాయిలెట్ రిపేర్స్ పెయింటింగ్స్ తదితర పనులు చేపట్టనున్నారు. ఇలా ఉండగా వసతిగృహాలు కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వసతిగృహాల ఆధునీకరణ, మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల హాస్టల్ వార్డన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా హాస్టల్స్ మరమ్మతు పనులు నాణ్యతగా జరిగేలా చూస్తామని, పనులు త్వరితగతిన ప్రారంభిస్తామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి టి.అఖిలేష్ రెడ్డి తెలిపారు.



సంగారెడ్డిలోని ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం



దత్తగిరి ఆశ్రమంలో పూజలు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

దత్తగిరి ఆశ్రమంలో మంత్రి పూజలు

ఝరాసంగం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో శని అమవాస్య సందర్భంగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ అర్చకులు వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమ ఆవరణలో ఉన్న శనైశ్చరుడి విగ్రహానికి నువ్వులు, నల్ల వస్త్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమంలోని నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహరాజ్ మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాల విజృంభణ..

పల్లెలు గజగజ



డెంగ్యూ కేసులు పెరిగిపోవడంతో ప్రజల్లో ఆందోళన

తూప్రాన్ ఆసుపత్రిలో కిక్కిరిసిన బెడ్లు

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్



తూప్రాన్ ఆసుపత్రిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అమర్‌సింగ్

తూప్రాన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పరిసర ప్రాంతాల్లో విష జ్వరాలు, డెంగ్యూ కేసులు భారీగా పెరిగిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ సమస్య తీవ్రమైంది. తూప్రాన్, మాసాయిపేట, శివ్వంపేట, మనోహరాబాద్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

ఆసుపత్రులకు పోటెత్తిన రోగులు

వైరల్ ఫీవర్లు, డెంగ్యూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో తూప్రాన్ ఆసుపత్రిలోని 50 పడకలు పూర్తిగా నిండిపోయాయి. కొత్తగా వచ్చే రోగులకు బెడ్లు దొరకడం కష్టంగా మారింది. ఆగస్టు 1 నుంచి 15 వరకు 73 ఫీవర్ కేసులు, 2 డెంగ్యూ కేసులు నమోదు కాగా, గత వారం రోజుల్లోనే 36 ఫీవర్ కేసులు, 8 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి శివారులోని నడిపితండా, పులిగుట్ట తండాలలోనూ విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలు తమ గ్రామాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, జ్వరాల సర్వే నిర్వహించి, మందులు పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఈ పరిస్థితిపై తూప్రాన్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్ స్పందిస్తూ ఆసుపత్రిలో తగినంత మందులు ఉన్నాయని, జ్వరం రాగానే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి రావాలని ప్రజలకు సూచించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

చేగుంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శనివారం నార్సింగి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన, ఆస్పత్రి నిర్వహణ, మందుల నిల్వలు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాల వల్ల చికెన్‌గున్యా, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి ఇళ్ల చుట్టూ నీరు నిలవకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు.



నార్సింగ్ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కదులుతున్న రైలు ఎక్కబోయి...
జారిపడి రైల్వే మాజీ ఉద్యోగి మృతి


తాడేపు కిష్టయ్య (ఫైల్)

● మనోహరాబాద్‌లో విషాదకర ఘటన

మనోహరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కబోయి జారిపడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మనోహరాబాద్ రైల్వే స్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ సాదు లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్‌కు చెందిన తాడేపు కిష్టయ్య (71) బోధన్ నుంచి కాజీపేట వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. రైలు చక్రాల కింద పడటంతో అతని రెండు కాళ్లు తెగిపోయాయి. వెంటనే స్థానికులు అతడిని మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. కిష్టయ్య గతంలో రైల్వే పైలట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయనకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పదవీ విరమణ తర్వాత మల్కాజిగిరిలో నివాసం ఉంటున్నారు. శనివారం తన సొంత గ్రామం మనోహరాబాద్‌కు వచ్చి పనులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ విషాదం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. యువకుడి మృతి

● తల్లి పరిస్థితి విషమం.. హుస్నాబాద్‌లో ఘటన
● బాధితులకు న్యాయం చేయాలని రాస్తారోకో


అజయ్ (ఫైల్)

హుస్నాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని బస్ డిపో రోడ్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, అతని తల్లి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ లక్ష్మారెడ్డి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన బూడిద అజయ్(28) తన తల్లి పద్మతో కలిసి స్కూటీపై పాల కేంద్రానికి వెళ్తుండగా, ఆరపల్లికి చెందిన నమిలికొండ రామకృష్ణ అనే యువకుడు అతి వేగంగా బైక్‌పై వచ్చి వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అజయ్‌కు తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పద్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన అజయ్‌కి భార్య సౌమ్య, 9 నెలల కుమారుడు ఉన్నారు. కాగా, నిందితుడు మద్యం సేవించి బైక్ నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబసభ్యులు, వివిధ పార్టీల నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రాస్తారోకో చేశారు. సుమారు గంటసేపు ఆందోళన కొనసాగగా, పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అజయ్ భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ టైరు తలపైకెక్కి రైతు దుర్మరణం

● కొండాపూర్‌లో విషాద ఘటన.. బంధువుల ఆందోళన


కొత్తగొల్ల రాములు(ఫైల్)

కొండాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఒక రైతును మైనింగ్ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కొండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం గాజులగూడకు చెందిన రైతు కొత్త గొల్ల రాములు (58) శనివారం కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని తన పొలంలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో గాజులగూడ వైపు నుంచి అజాగ్రత్తగా వచ్చిన మైనింగ్ లారీ అతడి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాములు తల మీద నుంచి లారీ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా మైనింగ్ ప్రాంతానికి పారిపోయాడు. ఈ ఘటనతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. మైనింగ్ లారీల వల్ల తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఆరోపించారు. సమాచారం అందుకున్న సీఐ సుమన్, ఎస్ఐ సోమేశ్వరి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు ఆర్థిక సహాయం చేస్తామని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

బెజ్జంకి మండలం తోటపల్లిలో మహిళ, హవేళీఘణపూర్ మండలంలో సర్దనలో వ్యక్తి, నిజాంపేట మండలంలో మరో మహిళ ఆత్మహత్య చేసుకున్నారు.

బెజ్జంకి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రేవేదు లక్ష్మీ (55) పురుగుల మందు తాగి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బెజ్జంకి మండలం తోటపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గతంలోనే భర్త మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తున్న లక్ష్మీకి ఇటీవల అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడింది. మృతురాలి కూతురు వాసవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు మరణాన్ని తట్టుకోలేక తండ్రి..

హవేళీఘణపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కూతురి మరణాన్ని తట్టుకోలేక, మద్యానికి బానిసైన ఒక తండ్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సర్దన గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పిల్లి కృష్ణ (40) అనే రైతు సంవత్సరం క్రితం తన కూతురు వెంకటలక్ష్మి అనారోగ్యంతో మరణించడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై, శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సర్దనలో మనస్తాపంతో మహిళ..

నిజాంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భర్త దూరంగా ఉండటం, అనారోగ్య సమస్యల కారణంగా మనస్తాపానికి గురైన ఓగుల రాజవ్వ (55) అనే మహిళ నిజాంపేటలో శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న కుమారుడు ఇంటికి వచ్చేసరికి ఈ విషయం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి
నీట మునిగి వ్యక్తి మృతి


వద్ది రమేష్ (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన ఒక వ్యక్తి వలలో చిక్కుకుని నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని మహమ్మద్‌నగర్‌లో శుక్రవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వద్ది రమేష్ (44) సాయంత్రం గ్రామంలోని అవుసులవాని కుంటలోకి చేపలు పట్టడానికి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడానికి వెళ్లగా, గట్టుపై అతని బట్టలు కనిపించాయి. ఈతగాళ్ల సహాయంతో గాలించగా, రమేష్ కాళ్లకు చేపల వల చుట్టుకుని ఉండటంతో నీట మునిగి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నర్సాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం... నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్‌లో విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న నర్సింలు (39) ఈ నెల తీన ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలైన అతడిని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

కొండపాక, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయిని రవాణా చేస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన రాకేష్, దుద్దెడకు చెందిన అమీర్, ఆకాష్, నర్సింలు అనే నలుగురు యువకులు గంజాయి తాగుతూ, సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్నారని సమాచారం రావడంతో దుద్దెడ గ్రామం శివారులోని రైల్వే ట్రాక్ వద్ద త్రీ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి దాడి చేశారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన వారిని పట్టుకుని తనిఖీ చేయగా, వారి వద్ద 254.9 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.400 నగదు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గంజాయికి అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని విచారణలో తేలింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.6,370 ఉంటుందని, నిందితులను రిమాండ్‌కు పంపించామని సీఐ తెలిపారు.

కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఇద్దరు..

మునిపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మునిపల్లి పోలీసులు కంకోల్ టోల్ ప్లాజా వద్ద శనివారం పట్టుకున్నారు. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేస్తుండగా, ఓ స్కూటీపై అనుమానం వచ్చి ఆపి విచారించారు. హైదరాబాద్‌కు చెందిన మందుగుల మారుతి, కల్వకుర్తికి చెందిన మందుగుల అఖిల తేజ కర్ణాటకలోని బీదర్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయి, ఒక స్కూటీ, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ రాజేష్ నాయక్, సిబ్బందిని కొండాపూర్ సీఐ సుమన్ కుమార్ అభినందించారు.


ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఏడుపాయలలో తగ్గిన వరద ఉధృతి

పాపన్నపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులుగా మంజీర నీటిలో మునిగిన దుర్గమ్మ ఆలయం వద్ద శనివారం వరద ఉధృతి తగ్గింది. దీంతో ఆలయ బ్రిడ్జి తేలింది. వరుసగా మంజీర ప్రవాహం కొనసాగుతుండటంతో ఆలయ ప్రాంగణం గడ్డి, నాచుతో నిండిపోయింది. దీంతో అమ్మవారి ఆలయ పరిసరాలను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. ఈ నెల 14నుంచి సింగూరు నీటిని విడుదల చేయడంతో దుర్గమ్మ ఆలయం జలదిగ్బంధంలో కొనసాగింది. అప్పటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు రాజగోపురం లో ఉంచి పూజలు చేస్తూ, భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఆదివారం వరద పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని ఇరిగేషన్ ఏఇ సతీష్ తెలిపారు.


వనదుర్గమ్మ ఆలయం వద్ద తగ్గిన వరద

విహారయాత్ర, దైవదర్శనానికి ఆర్టీసీ ప్యాకేజీలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం, విహారయాత్రల కోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలు తీసుకొచ్చిందని సంగారెడ్డి డిపోమేనేజర్ ఉపేందర్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని మహోరాగఢ్‌లోని రేణుకామాత ఏకవీర శక్తి పీఠం దేవాలయానికి ఈ నెల 30న రాత్రి 8 గంటలకు సంగారెడ్డి నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి, ఆదిలాబాద్ జిల్లాలోని పోచార్ వాటర్ ఫాల్స్ సందర్శించి తిరిగి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు సంగారెడ్డికి చేరుకుంకుంటుంది. రెండో విహారయాత్ర టూర్ ప్యాకేజీలో భాగంగా ఈ నెల 31న ఉదయం 5 గంటలకు సంగారెడ్డి నుంచి బయలుదేరి నాగార్జునసాగర్ డ్యాం సందర్శన, అనంతరం వైజాగ్ కాలనీ బ్యాక్ వాటర్‌లో బోటింగ్‌ను సందర్శించి తిరిగి రాత్రి 10 గంటలకు సంగారెడ్డికి చేరుకుంటుందన్నారు. చార్జీలు తదితర వివరాలకు 93986 90602, 73828 31275, 99592 26267 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి
రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు శ్రీరామ్ రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపు లేకపోవడంతో రైతులకు ఒక్క బస్తా యూరియా దొరకడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా యూరియా అందించడంలో విఫలమైందని దుయ్యబట్టారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులకు సగం మందికే రుణమాఫీ చేయడం, వర్షాకాలం యాసంగికి సన్నవడ్లకు బోనస్ కూడా చెల్లించలేదని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గడీల భైరవరెడ్డి, రాష్ట్ర సలహాదారుడు రామ్‌చందర్ రావు, జిల్లా సలహాదారుడు గాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి
తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకులు



సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లోపే నెరవేర్చాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, స్వాతంత్ర సమరయోధులు వంగ గాలిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు మిట్టపల్లి స్వరూపరాణి డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమ నాటి కేసులు ఎత్తివేయాలని, ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారి కుటుంబాలకు హెల్త్‌కార్డులు, ప్రభుత్వ పథకాలలో మొదటి ప్రాధన్యత ఇవ్వాలని అన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో రెండు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో చెన్నోజు సుదర్శన్, వాసంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లె భారతి, కావేరి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌పై విచారణ

నారాయణఖేడ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లో కొనసాగుతున్న పెద్ద శంకరంపేట మహాత్మాజ్యోతిబాఫూలే బీసీ గురుకుల పాఠశాలలో గురుకులాల రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి తిరుపతి శుక్రవారం రాత్రి విచారణ జరిపారు. ప్రిన్సిపాల్ అక్రమాలు, విద్యార్థులకు అనారోగ్యాలు, నాణ్యతలేని భోజనం తదితర అంశాలపై పత్రికల్లో కథనాలు రావడంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈ గురుకులాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి విచారణ జరిపారు. అయితే.. పిన్సిపల్, పీఈటీ, మరో ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యూటీ కార్యదర్శికి తప్పుడు సమాచారం ఇవ్వడంతో పాటు కొందరు విద్యార్థులతో ప్రిన్సిపాల్ మంచివాడని కితాబు ఇప్పించినట్లు సమాచారం. డిప్యూటీ సెక్రటరీ బహిరంగంగా విద్యార్థులను ప్రశ్నించడంతో వారు ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నోరుమెదపలేదని తెలుస్తోంది. విచారణ అధికారి కూడా అంతా బాగుందని, విచారణ ముగించి రాత్రి ప్రిన్సిపాల్‌ను పాఠశాల నుంచి తన కారులో తీసుకెళ్లారు. దీంతో విచారణ మమ అనిపించారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

వయ్యారిభామతో ఆరోగ్య సమస్యలు



కొండపాక, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వయ్యారిభామ మొక్కలతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని, వాటిని నిర్మూలించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రైతు విజ్ఞానవేదిక శాస్త్రవేత్త పల్లవి పేర్కొన్నారు. శనివారం కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో వయ్యారిభామ నిర్మూలనపై సిరిసిల్ల టీజేఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త పల్లవి మాట్లాడుతూ వయ్యారిభామ పుప్పొడి వల్ల మనుషులకు, పశువులకు దగ్గుదమ్ము వస్తుందని, ఒంటిపై దురద, దద్దుర్లు ఏర్పడతాయన్నారు. విషజ్వరాలు వ్యాపింపజేస్తుందన్నారు. ఈ మొక్కను పంటపొలాల్లో గమనించినట్లయితే పూతదశకు రాకముందు వేర్లతో సహా తీసివేసి ఒక గుంతలో వేసి మట్టి కప్పి నాలుగైదు మాసాల్లో సేంద్రియ ఎరువుగా చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ తీసి, పొలం గట్లపై వయ్యారిభామ మొక్కలను తీసి వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు

గజ్వేల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యుడిని బెదిరించిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన ఇద్దరు వీడియో తీసి, ఈ విషయం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తానని వైద్యుడు నాగమునెయ్యను బెదిరించడంతోపాటు అతని ఆస్పత్రికి పేరును ఉపయోగించి, బయట వ్యక్తులను పెట్టుకుని వీడియో తీసి, మరో వ్యక్తి ద్వారా బెదిరింపులకు పాల్పడిన నిరంజన్, మరో వ్యక్తిపై వైద్యుడు నాగమునెయ్య ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

టెక్ విలేజ్ @ సంగుపేట

ఇంటింటికీ ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఫోన్ సేవలు

రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా గ్రామం



జోగిపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగుపేట గ్రామం టెక్‌విలేజ్‌గా మారింది. టీ-ఫైబర్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు, టెలిఫోన్, కేబుల్ టీవీ సదుపాయాలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌తో కలిసి టీ-ఫైబర్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని నారాయణపేట జిల్లా మద్దూరు, పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్‌తోపాటు సంగారెడ్డి జిల్లాలోని సంగుపేటలను ఎంపిక చేసింది. ఈ గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా గత డిసెంబర్ 8న పనులను ప్రారంభించారు. బీఎస్ఎన్ఎల్, ఏసీఎస్ టెక్నాలజీ అనే ప్రైవేట్ సంస్థ, స్మార్ట్ ప్లే అనే ఎంఎస్‌వో సహకారంతో ఇంటింటికీ ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఫోన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

గ్రామంలో 386 ఆవాసాలు ఉండగా, ఇందు లో వలస వెళ్లిన వారిని పక్కన పెడితే 310 ఇండ్లు మాత్రమే లెక్కకు వచ్చాయి. ఆయా ఇళ్లకు ఇంటర్నెట్, ఫోన్ సదుపాయం, కేబుల్ టీవీ సదుపాయం కల్పించేందుకు అవసరమైన పనులు పూర్తి చేశారు. గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొదటి కనెక్షన్‌ను బిగించారు. ట్రయల్‌రన్ జరిపి, సిగ్నళ్ల బలం, టీవీ ప్రసారాల నాణ్యత, ఇతర ఇబ్బందులను పరిశీలించారు. తర్వాత ప్రతీ ఇంటికి కేబుళ్లు వేసి ఇంటర్నెట్, ఫోన్, టీవీ ప్రసారాల కనెక్షన్లు ఇచ్చారు. ఇవన్నీ పూర్తయ్యేసరికి దాదాపుగా 5 నెలలు పట్టింది.

నిర్వహణ కోసం వాట్సాప్ గ్రూప్

ఇంటింటికీ ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వడం ఒక భాగమైతే.. దాని నిర్వహణకు వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్‌లో రోజూ సిగ్నళ్లను పరిశీలించడం. కోతుల బెడదతో కేబుల్ వైర్ తెగిపోవడం లాంటి సమస్యలు అధిగమించడం, ఆయా ఇళ్లల్లోని నిరక్షరాస్యులైన వినియోగదారుల ఇండ్లలో టీవీ ప్రసారాలు, ఇంటర్నెట్ కనెక్షన్ విషయంలో తలెత్తే సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారం చూపుతారు. ఇందులో బీఎస్ఎన్ఎల్ తరపున ఒకరు, ఏసీఎస్ టెక్నాలజీస్ తరపున ఒకరు గ్రూప్ అడ్మిన్‌లుగా ఉంటారు. వినియోగదారుడు తమ ఇంట్లోని టెక్నికల్ సమస్యలను ఈగ్రూప్‌లో తెలియజేస్తే చాలు.. నేరుగా సదరు ఉద్యోగి ఆ ఇంటికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తున్నారు.

ప్రభుత్వ సంస్థలకు ఉచితమే

గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు ఉచితంగానే ఇంటర్నెట్ సేవలను అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో గ్రామ పరిధిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్, గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, రైతు సేవా కేంద్రం (రైతు వేదిక)కు ఉచితంగానే ఇంటర్నెట్ కనెక్షన్లు ఇచ్చారు. ఇక, వర్చువల్ డెస్క్ టాప్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ (వీడీఐ) పేరిట...వీడియో కాన్ఫరెన్స్‌ల కోసం ఉపయోగపడేలా ఆయా కార్యాలయాలకు కీబోర్డ్, స్క్రీన్ (మానిటర్), ల్యాండ్ లైన్ ఫోన్ (పరికరం) లను కూడా ఉచితంగానే అందిస్తున్నారు.

మూడు నెలలు ఉచితం

ఈ పథకం కింద ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకున్న నాటి నుంచీ తొలి మూడు నెలలు ఉచితంగా సేవలు అందించనున్నారు. వాస్తవానికి గ్రామంలో ఇంటింటికీ కనెక్షన్ ఇవ్వడం మే నాటికే పూర్తయ్యింది. జూన్ మొదటి వారం నుంచీ ఇంటర్నెట్, టీవీ ఛానెళ్ల ప్రసారం పూర్తి స్థాయిలో అందడం మొదలైంది. గ్రామస్థుల కోరిక మేరకు జూన్ నెలను మినహాయించి, జూలై మొదటి తారీఖు నుంచి మూడు నెలలపాటు ఉచితంగా ఇంటర్నెట్, ఫోన్, టీవీ ప్రసారాల సేవలు అందిస్తామని సీజీఎం ఇటీవల గ్రామస్థులతో సమావేశమై హామీనిచ్చారు. దీంతో జూలై నుంచి మూడు నెలల పాటు ఫ్రీగా ఈసేవలు అందనున్నాయి. నాలుగవ నెలనుంచీ ప్రతీ నెలా కేవలం రూ. 300కే ఈసేవలు లభ్యం కానున్నాయి. ఈపథకంలో భాగంగా, ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్న ప్రతీ టీవీకి 350 ఫ్రీ ఛానెళ్లు, డిస్కవరీ, నేషనల్ జియోగ్రాఫిక్, ట్రావెల్ లాంటి 40 పే ఛానెళ్లనూ, ఇతర మూవీ ఛానెళ్లను ఉచితంగానే అందిస్తున్నారు. 15 ఫోక్ చానెళ్లను, సినిమాలను ప్రసారం చేసే మరి కొన్ని ఛానెళ్లను కూడా ఇస్తున్నాయి. లైవ్ టీవీతోపాటు జర్నలిస్ట్ డైరీ యాప్ ద్వారా రాష్ట్రంలోని ప్రధాన వార్తాపత్రికలను కూడా టీవీల్లో చదవొచ్చు. యూట్యూబ్‌ను కూడా అందజేస్తున్నారు. గ్రామస్థుల కోరిక మేరకు గత ఐపీఎల్ క్రికెట్ మ్యాచులను కూడా ఉచితంగానే అందజేయడం విశేషం.

అందరి సహకారంతో..



టీ-ఫైబర్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ పథకంలో భాగమవ్వడం గర్వంగా ఉంది. ఈసేవల వల్ల గ్రామమే పూర్తిగా డిజిటలైజ్ అవుతుందనడంలో సందేహం లేదు. గ్రామ కార్యదర్శి, గ్రామ ముఖ్యులు అందించిన సహకారం మరువలేనిది. ఏసీఎస్ టెక్నాలజీస్ సంస్థ భాగస్వామ్యం, స్థానిక బీఎస్ఎన్ఎల్ సర్వీస్ ప్రొవైడర్ ప్రవీణ్‌ల సహకారంతోనే ఇది సాధ్యమైంది.

- రాకేశ్, బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్

డిష్ కంటే చౌక..



గతంలో టీవీల్లో సినిమాలు, సీరియళ్లు చూడాలనుకుంటే డిష్ టీవీ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చేది. దీనికి ప్రతీ నెలా రూ.600 నుంచి రూ.700 చెల్లించాల్సి వచ్చేది. టీ ఫైబర్‌లో మా ఇంటికి కనెక్షన్ తీసుకున్నా. నెలకు కేవలం రూ.300తో.. ఇంటర్నెట్ కనెక్షన్‌తోపాటు, ఫోన్, టీవీ ఛానెళ్ల ద్వారా సీరియళ్లు, సినిమాలు కూడా చూడగలుగుతున్నాం.

-వెంకటలక్ష్మి, వినియోగదారు


అల్వాల్‌లో యూరియా కోసం పాస్‌బుక్‌లు క్యూలో పెట్టిన రైతులు


హవేళీఘనపూర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం ఆగని ఆందోళనలు

మిరుదొడ్డి/రాయపోల్/ హవేళిఘనపూర్/పెద్దశంకరంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతుల ఆందోళనలు ఆగడం లేదు. ఉదయం నుంచే గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వస్తోందంటూ రైతులు సహనం కోల్పోతున్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామ రైతువేదిక వద్దకు యూరియా వచ్చిందని తెలియడంతో శనివారం రైతులు భారీగా వచ్చారు. అక్కడికి వచ్చిన వ్యవసాయాధికారులను అడ్డుకుని, రైతు వేదికలో నిర్బంధించారు. అంతకుముందు క్యూలో పాస్‌బుక్‌లు, ఖాళీ మద్యం సీసా పెట్టారు. రాష్ట్రంలో యూరియా దొరకడం లేదని, మద్యం ఏరులైపారుతోందని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు యూరియా దొరడం లేదన్నారు. యూరియా విషయంలో ఎంపీ రఘునందన్ యూరియా కొరత లేదనడం సరైంది కాదన్నారు. రైతులు యూరియా కోసం చెప్పులు అరిగేలా తిరిగిన కూడా యూరియా దొరకని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. ఎస్సై సమతా తన సిబ్బందితో కలిసి వచ్చి, రైతులతో మాట్లాడారు. ఈ క్రమంలో పోలీసులతో రైతులు వాగ్వాదానికి దిగారు. నిర్బంధంలో ఉన్న అధికారులను పోలీసులు బయటకు తీసుకువచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. రైతుల ఆందోళనకు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రాజులు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు హైమద్, బీఆర్ఎస్ నాయకులు బాపురెడ్డి, సత్యనారాయణ, మాజీ సర్పంచులు మద్దతు తెలిపారు. రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి ఫర్టిలైజర్ షాప్‌కు శనివారం 570 బస్తాల యూరియా వచ్చింది. దీంతో వందలాది రైతులు వచ్చి క్యూ కట్టారు. గంటల తరబడి నిలబడలేక చెప్పులను క్యూలో పెట్టారు. తొగుట సీఐ లతీఫ్, బేగంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. మెదక్ జిల్లా హవేళిఘణపూర్‌లో పది రోజుల నుంచి రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. శనివారం యూరియా రావడంతో భారీగా క్యూ కట్టారు. అధికారులు టోకెన్లు జారీ చేసి, ఒకొక్కరికీ రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. పెద్దశంకరంపేటలోనూ యూరియా కోసం ఫర్టిలైజర్ దుకాణాల వద్ద రైతులు బారులు దీరారు. పోలీసులు వచ్చి, క్రమపద్ధతిలో రైతులకు యూరియా అందేలా చేశారు.


పెద్దశంకరంపేటలో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

స్వాతంత్ర్య సమరయోధుడి కన్నుమూత


ఈశ్వరయ్య(ఫైల్)

అల్లాదుర్గం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మజ్జిగ ఈశ్వరయ్య (96) శనివారం సాయంత్రం కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రులు చికిత్స చేయించారు. అక్కడే ఆయన కన్నుమూశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడిగా ఈ ప్రాంతంలో ఈశ్వరయ్య గుర్తింపు తెచ్చుకున్నారు. ఈశ్వరయ్యకు భార్య మల్లమ్మ, కుమారులు మల్లికార్జున్, వీరేందర్ ఉన్నారు. ఆయన మరణవార్త తెలిసి మండలంలోని పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

బీవీఆర్ఐటీలో సాంకేతిక సింపోజియం

నర్సాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ఐటీ కాలేజీలో శనివారం సాంకేతిక సింపోజియం ఐడియా పిచ్చింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన పలు కాలేజీల నుంచి సుమారు 56 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లూసెస్ ఇన్నోవేషన్ సీఈవో వీఎస్‌కే మూర్తి హాజరయ్యారు. బీహెచ్ఈఎల్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ కన్నన్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ హెచ్‌వోడీ రాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.



ఉమ్మాపూర్ గుట్టల్లో కాలభైరవుడికి పూజలు

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మాపూర్ గుట్టలలో కొలువుదీరి ఉన్న శ్రీ చండీ సమేత కాలభైరవునికి శనివారం భక్తులు హోమం, పూజలు చేశారు. పురాతన విగ్రహం వద్దకు వచ్చిన భక్తులు భక్తితో పూజలు చేశారు. చండీ సమేత కాలభైరవుడికి పూజలు చేయడం వల్ల ఈ ప్రాంతంలో పాడిపంటలు సమృద్ధిగా పండి, సుఖసంతోషాలతో జీవిస్తారని భక్తుల నమ్మకం.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి
ఎంపీ రఘునందన్‌రావు



వర్గల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి గొప్ప ఆశయంతో ముందుకు సాగుతూ మంచి పౌరులుగా ఎదగాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. శనివారం వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవానికి డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించి, అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యాలయంలో ఎంత మంది శాస్త్రవేత్తలు అవుతారంటూ ప్రశ్నించారు. పట్టుదల ఉంటే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదన్నారు. డీఆర్డీవో సీనియర్ శాస్తవేత్త డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో దేశం ఎంతో ప్రగతిని సాధించిందన్నారు. భారత ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనలో శాస్త్రవేత్తలకు సహాయ పడుతున్నందను ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్, అధ్యాపక బృందం, విద్యార్థులు, బీజేపీ మండల అధ్యక్షులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల పనుల జాతరలో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

కంది, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పనుల జాతరను కంది మండలం చేర్యాలలో శనివారం టీజీఐఐసీ చైర్మన్ టి. నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా చేర్యాల గ్రామంలో నిర్మలా జగ్గారెడ్డి, నాయకులు, అధికారులతో నూతన అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనుల జాతరలో భాగంగా గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల ప్రహరీలు, సీసీరోడ్ల నిర్మాణం, నూతన చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పనులు చేపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. అంతేగాక ఉపాధిహామీ పథకంలో ప్రజలకు వ్యక్తిగత లబ్ధి చేకూర్చే ఫౌల్ట్రీ షెడ్లు, పశువుల పాకలు, ఇంకుడు గుంతలు, కొత్తగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులను చేపట్టినట్లు నిర్మలా జగ్గారెడ్డి వివరించారు. కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి వెంట కాంగ్రెస్‌పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి జూలకంటి ఆంజనేయులు, మార్కెట్‌కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్, కంది మండల పార్టీ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్, నాయకులు రుద్రారం ప్రకాశ్, చేవెళ్ల వెంకట్‌రెడ్డి, సారా శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేదర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంది మండలం చేర్యాలలో పనులో జాతరలో నూతన అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేసిన నిర్మలాజగ్గారెడ్డి

న్యూస్ బాక్స్

అంజనాద్రి నుంచి సంగమేశ్వరాలయానికి పాదయాత్ర

కల్హేర్/పెద్దశంకరంపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కల్హేర్ మండలం మాసాన్‌పల్లి చౌరస్తాకు సమీపంలోని కామారెడ్డి జిల్లా బ్రహ్మణపల్లి అంజనాద్రి ఆలయం నుంచి శ్రావణ మాసం మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోల్ సంగమేశ్వర ఆలయానికి నిర్వహించిన పాదయాత్రలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంజనాద్రి ఆలయ వ్యవస్థాపకుడే కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ఈ పాదయాత్ర వెళగనూర్ క్రాస్ రోడ్, కల్హేర్ మండంలోని మాసన్‌పల్లి చౌరస్తా, దేవునిపల్లి, నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి, నిజాంపేట, జంబికుంట, పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్, పెద్దశంకరంపేట, శివాయిపల్లి, రామోజీపల్లి గ్రామాల మీదుగా కొత్తపేట గ్రామ శివారులోని ప్రఖ్యాత శివాలయం అయిన కొప్పోల్ సంగమేశ్వర ఆలయానికి చేరుకుంది.

రుద్రారం బ్రహ్మోత్సవాలకు మంత్రులకు ఆహ్వానం

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రుద్రారం గణేష్ దేవస్థానం వినాయక చవితి బ్రహ్మోత్సవాలు సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ మాధవనేని రఘునందన్ రావు తదితరులకు దేవస్థానం తరపున ఆహ్వానాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని దేవస్థాన కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా వారితో పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు.

ఓపెన్ స్కూల్ ఒక వరం

పాపన్నపేట ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఎంతో మేలు చేస్తుందని పాపన్నపేట మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రోజు ఆయన పాపన్నపేట కాంప్లెక్స్ హెచ్ఎం మహేశ్వర్, ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ రియాజ్‌తో కలిసి ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 31 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్ ఫీజు గడువు ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

సేవాభావం ఎంతో గొప్పది



ట్రస్మా ఆధ్వర్యంలో మరెల్లి వెంకటయ్యను సన్మానిస్తున్న దృశ్యం

జహీరాబాద్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడైన మరెల్లి వెంకటయ్య సమాజసేవలో భాగంగ విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు, పలువురికి ఉపాధి కల్పించడం హర్షణీయమని, ఆయన సేవాభావం ఎంతో గొప్పదని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో ట్రస్మా నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మాణిక్‌ప్రభు పాఠశాల కరస్పాండెంట్ మరెల్లి వెంకటయ్యను వారు సన్మానిస్తు అవార్డును అందజేశారు. ఈసందర్భంగ మాణిక్‌ప్రభు పాఠశాల కరస్పాండెంట్ మరెల్లి వెంకటయ్య మాట్లాడుతు సేవాదృక్పథం ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాఘవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

చిలప్‌చెడ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో నూతన సాంకేతికత పరిజ్ఞానాన్ని రైతులు అలవర్చుకోవాలని. అప్పుడే రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గి దిగుబడి పెరిగి అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సోమక్కపేట గ్రామంలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

నర్సాపూర్/వెల్దుర్తి/పటాన్‌చెరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రుల ఉత్సవాలను శాంతియుతంగా సోదరభావంతో జరుపుకోవాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం యాదవ సంఘం భవనంలో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడారు. వినాయక మండపాలు ఏర్పాటు చేయాలనుకునేవారు నిబంధనలు పాటిస్తూ, సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం, తహసీల్దార్ శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఏడీఈ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి పాల్గొన్నారు. వెల్దుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ రాజు మండల వ్యాప్తంగా వినాయక మండపాల నిర్వాహకులతో శనివారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పటాన్‌చెరు మండల పరిషత్తు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రశాంతంగా జరిగేటట్లు అధికారులు సహకరించాలని సూచించారు.

జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి



జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి నాగేశ్వర రావు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే గణేశ్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి బి.నాగేశ్వరరావు సూచించారు. మండపాలకు దగ్గరగా గ్యాస్, పెట్రోల్, డీజిల్, బాణాసంచా స్టోర్ చేయరాదన్నారు. డీజిల్ జనరేటర్‌ను మండపానికి కనీసం 5 మీటర్ల దూరం ఏర్పాటు చేయాలన్నారు. లూస్ వైరింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. మండపాల వద్ద కచ్చితంగా రెండు డ్రమ్ముల నీరుతో పాటు రెండు బకెట్ల నీరు, రెండు బకెట్ల పొడి ఇసుకను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద అగ్నిని ఆర్పే సాధనాలను అందుబాటులో ఉంచుకోవాలని, మండపాల వద్ద వాడే డెకొరేషన్‌కు ఫైర్ ప్రూఫ్ వస్తువులు వాడేలా చూసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 101 లేదా లోకల్ ఫైర్ స్టేషన్ నెంబర్‌కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

కొండాపూర్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ, నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయుల చేసే అభ్యాసనతో విద్యార్థులు ఉన్నతమైన స్థానాలకు చేరవచ్చని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చెర్లగోపులారం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేలా టై, బెల్టులను ఉచితంగా అందజేయడంపై మాజీ సర్పంచ్ ప్రకాశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి లింబాజీ, ఎంఈవో దశరథ్, ప్రధానోపాధ్యాయులు యాదగిరి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

చిన్నశంకరంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠాలు అర్థమయే విధంగా బోధించాలని డీఈవో రాధా కిషన్ అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రికార్డులను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

జహీరాబాద్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్‌పట్టణ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని భవానిమందిర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నవారి ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ వ్యాపారులు రోడ్లపై సామగ్రిని ఉంచడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నదని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

పాపన్నపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరాం సూచించారు. శనివారం సాయంత్రం పాపన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో సరిపడ మందులు అందుబాటులో ఉంచాలన్నారు.పలు సూచనలు చేశారు.

మనస్తాపంతో గృహిణి ఆత్మహత్య

నర్సాపూర్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో ఓ గృహిణి ఆరోగ్యం బాగా లేక మనస్తాపంతో శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్‌లోని జగన్నాధరావుకాలనీకి చెందిన చిత్తారిశ్రీనివాస్, శాంతి(34) దంపతులు కూలీ పనిచేసుకుని జీవనం సాగిస్తున్నారు. భార్య శాంతికి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర మనస్తాపానికి గురైంది. ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

బాలిక అదృశ్యం



ఆసియాఖటూన్

పటాన్‌చెరు ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యం కేసు నమోదైంది. శనివారం సీఐ విజయకృష్ణ వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆసియాఖటూన్ కుటుంబసభ్యులతో ఘన్‌పూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. తల్లితండ్రులు ఓ నిర్మాణ సంస్థలో పని చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లిన ఆసియాఖటూన్ ఇంటికి చేరుకోలేదు. రెండు రోజులుగా చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిజాంపేటలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

నిజాంపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ లాంటి నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కిరాణా, హోటళ్లు, వ్యాపార సముదాయాల వద్ద శనివారం మత్తు పదార్థాలతో పాటు మద్యంను గుర్తించేందుకు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

జహీరాబాద్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లో శనివారం పేకాటస్థావరాలపై దాడులుచేసి నలుగురిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణంలోని అల్లీపూర్‌లో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. వారి నుంచి రూ.1400 నగదు, 3 ద్విచక్రవాహనాలు, స్వాధీనం చేసుకున్నారు.

చైతన్య భారతి హైస్కూల్‌కు సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డు

మెదక్ అర్బన్/పాపన్నపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని చైతన్య భారతి హై స్కూల్‌తో పాటు పాపన్నపేటలోని శ్రీ విద్య పాఠశాలకు డా. సర్వేపల్లి రాధాకృష్ణ నేషనల్ అవార్డు దక్కింది. శనివారం హైదరాబాద్‌లో ఏడీటెక్ఎక్స్‌ో ఆధ్వర్యంలో బెస్ట్ కరస్పాండెంట్ అవార్డులు అందజేశారు. మెదక్ జిల్లాలోని 8 పాఠశాలలు ఎంపిక కాగా.. అందులో చైతన్య స్కూల్ కరస్పాండెంట్ జుబేర్ అహ్మద్, శ్రీ విద్య పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్, సుమన్, నిరలాక్షప్ప సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ అవార్డు అందుకున్నారు. వ్యక్తిత్వ వికాసంతో పాటు, మెరుగైన విద్యను అందిస్తున్నందుకు, క్రీడారంగంలో రాణిస్తున్నందుకు ఈ అవార్డు లభించిందని అవార్డు గ్రహీతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కోశాధికారి రాఘవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చౌదరి, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

త్రికరణశుద్ధితో అధ్యయనం చేయాలి: ఆర్డీవో

మెదక్ అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చదువు పట్ల త్రికరణ శుద్ధితో అధ్యయనం చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా కొనసాగుతున్న జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ.. విద్య మనిషిని అజ్ఞానం నుంచి జ్ఞానం పొందే దిశగా తీసుకెళ్తుందన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివిన విద్య మనల్ని సమాజంలో ఒక మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి నిలబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.హుస్సేన్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో భాగస్వామ్యం కావాలి

మెదక్ అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వామ్యం కావాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన 17వ ఈశా గ్రామోత్సవ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల యువతకు క్రీడల్లో ఆసక్తిని పెంచే లక్ష్యంగా గ్రామోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో 27 జట్లు, త్రోబాల్‌లో 7 జట్లు పాల్గొంటున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు వెల్లడించారు.

నిబంధనల మేరకే పనులు చేపట్టాలి

● డీఆర్డీవో శ్రీనివాస్‌రావు

అల్లాదుర్గం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకే పనులు చేపట్టాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. గ్రామీణ ఉపాధి హామి పథకం 2024- 25 సంవత్సరానికి సంబంధించిన పనుల పై శనివారం అల్లాదుర్గంలోని స్త్రీశక్తి భవనం వద్ద ప్రజావేదికను ఏర్పాటు చేశారు. గత ఏడాది కాలంగా మండలంలో చేపట్టిన ఉపాధి హామి పనులపై గత పది రోజులుగా సామాజిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రజావేదికలో వీటి అవకతవకలను, లోపాలను తనిఖీ బృందం బహిర్గతం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి వీటి వివరాలను వెల్లడించారు. 2024-25 సంవత్సరంలో ఉపాధి హామి పథకం ద్వార రూ 6.96 కోట్ల రూపాయల వ్యయంతో మండలంలో పనులు చేపట్టడం జరిగిందన్నారు. వీటి పనుల్లో జరిగిన అవకతవకల పై రూ.62 వేలు రికవరి, రూ 19 వేల జరిమానాలను విధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్సి అధికారి శ్రీహరి, అధికారులు సంపత్, రాజేందర్, అంజనేయులు, నాగరాజు,ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా అల్లాదుర్గం మండలంలోని గొల్లకుంట గిరిజన తండా గ్రామపంచాయతీకి ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంటును నియమించాలని కోరుతు తండా వాసులు డీఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేశారు.

సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

ఫోటోరైటప్.23.ఎస్ఆర్‌డి.6. సంగారెడ్డిలో సురవం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సురవం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎ. రహ్మన్ అన్నారు. సంగారెడ్డిలోని మార్క్సనగర్‌లో శనివారం సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి సీపీఐ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేశ వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు.

● సీపీఐ అగ్ర నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ అన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం ప్రకటించి మాట్లాడారు. వామపక్ష ఐక్యతకు కృషి చేశారని కొనియాడారు. సురవరం విజయలక్ష్మికి వారి కుటుంబ సభ్యులకు సీపీఎం సంగారెడ్డి జిల్లా కమిటి తరపున సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

గ్రామాల సమస్యలపై దృష్టి సారించండి: బీజేపీ

మెదక్ కల్చరల్ ఆగస్టు 23(అంధ్రజ్యోతి): మెదక్ మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షురాలు బెండ వీణ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ మల్లేశం గౌడ్‌తో కలిసి శనివారం ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్ పల్లిలో పీహెచ్‌సీ లేకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల గర్భిణులు, దీర్ఘకాలిక రోగులకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. కొంటూర్ పెద్ద చెరువు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేస్తే ఇక్కడి రైతులకు సాగుకు ఉపయోగపడుతుందని అన్నారు.బాలానగర్ మత్తడి పూర్తి ఇసుకతో నిండిపోయిందని పూడిక తీత చేయాలని కోరారు. భూపతిపూర్, తిమ్మానగర్ పరిధిలో ఉన్న గట్టు మైసమ్మ ఆలయం వద్దకు బీటి రోడ్డు మంజూరు చేయాలని అన్నారు.

వృద్ధులు, తల్లిదండ్రులపై నిర్లక్ష్యం తగదు



తునికిలోని ఓల్డ్ ఏజ్ హోంలో వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి హేమలత

కౌడిపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, తల్లిదండ్రుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ హేమలత పేర్కొన్నారు. నర్సాపూర్ మండల లీగల్ సర్వీస్ కమిటీ అధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని తునికిలోని డాక్టర్ డి రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఓల్డ్ ఏజ్ హోంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి హేమలత మాట్లాడుతూ కుటుంబంలోని తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ బాధ్యత కన్న పిల్లలదేనన్నారు. చిన్నతనం నుంచి పెంచి పెద్ద చేసిన వారిని కొంత మంది నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు. అనంతరం ట్రస్టులో ఉన్న వృద్ధుల బాగోగుల కోసం చెల్లించే డబ్బుల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ కృష్ణ, కౌడిపల్లి ఎస్ఐ రంజిత్ రెడ్డి, ట్రస్టు డైరెక్టర్ దేవెందర్ రెడ్డి, అర్ఐ శ్రీహరి, వలంటీర్ జగదీష్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వట్‌పల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జోగిపేట మున్సిఫ్ కోర్టు జడ్జి అసదుల్లాషరీఫ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మోడల్‌స్కూల్‌లో న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం రూపొందించబడిన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉంటే ఎన్నో రకాలుగా రక్షణ పొందవచ్చని విద్యార్థులకు సూచించారు.

ఆస్తి నేరాలను గ్యాంగ్ కేసులుగా గుర్తించండి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది కలిసి చేసే ఆస్తి సంబంధిత నేరాలను గ్యాంగ్ కేసులుగా గుర్తించాలని పోలీసు అధికారులను సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత పదేళ్లుగా గ్యాంగ్ నేరాలను గుర్తించి ఆయా వ్యక్తులపై గ్యాంగ్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి వివిధ రకాల ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతున్నందునే వీరి నుంచి సమాజాన్ని రక్షించేందుకు గ్యాంగ్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ గ్యాంగ్ కేసులు నాన్ బేయిలబుల్ అని, న్యాయస్థానంలో నిందితులకు 7 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానాలు కూడా విధించడం జరుగుతుందని ఎస్పీ వివరించారు.

'సెయింట్ ఆంథోనీస్'లో ఘనంగా ఫ్రెషర్స్ డే



ఫెషర్స్ డేలో పాల్గొన్న సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత, డైరెక్టర్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల పూర్వ విద్యార్థిని, టీజీపీఎస్‌సీ గ్రూప్-1 పరీక్షలో 39 వ ర్యాంకు సాధించిన మోక్షిత, రెజొనెన్స్ విశ్వవిద్యాలయాల అకాడమిక్ డీన్ ఈ.విద్యాసాగర్‌లు హాజరై విద్యార్థుల భవిష్యతునుద్దేశించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత ఈ.సోలోమోన్‌రెడ్డి, డైరెక్టర్లు విజయకుమార్‌రెడ్డి, జయబాలరెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, మేనేజ్‌మెంట్ పాపులమ్మ, అరుణారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జవహర్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన వైజ్ఞానిక ప్రదర్శనలు




వ్యోమగామి వేషధారణలో విద్యార్థి

రామయంపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలు విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను ప్రదర్శనగా ఉంచారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంఈవో శ్రీనివాస్ ఇక్కడ ఏర్పాటు చేసిన మినీ ప్లానిటోరియం సందర్శించి పిల్లలతో మాట్లాడారు.

భూ భారతి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

చిన్నశంకరంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులను నుంచి స్వీకరించిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. శనివారం చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మింగా సందర్శించి, రెవెన్యూ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్ఐ రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఇందిరమ్మ ఇళ్ల కోసం మట్టికి అనుమతులు ఇవ్వాలంటూ పలువురు గ్రామస్థులు, ఆర్డీవోను కోరగా సానుకూలంగా స్పందించారు.

ఉన్నత చదువులతో జీవితంలో స్థిరపడాలి



ఖేడ్ హైస్కూల్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడాలని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 875 మందికి శనివారం డిగ్నిటీ డ్రైవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్స్, కేరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రయాణ భద్రత, నారీశక్తి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రెషర్స్ పార్టీలో పాల్గొని విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ తో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ఆడపిల్లలకు తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలన్నారు. సబ్ కలెక్టర్ ఉమాహారతి, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ, సిబ్బంది, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాల్సిందే



సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో నిరసన తెలుపుతున్న తపస్ నాయకులు



మొగుడంపల్లి మండలం ధనసిరి పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ జిల్లా బృందం

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. పలు మండలాల్లో పెన్షన్ విద్రోహదినంగా పాటిస్తూ భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. మరికొన్ని చోట్ల సీపీఎస్ జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం ఆయా మండలాల్లోని తహసీల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు తపస్ నాయకులు మాట్లాడుతూ.. సీపీఎస్‌తో ఉద్యోగుల జీవితం భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట తపస్ జిల్లా శాఖ అధ్యక్షుడు దత్తాద్రి ఆధ్వర్యంలో సీపీఎస్ జీవో ప్రతులు దహనం చేయడంతో పాటు నిరసన తెలియజేసి కలెక్టరేట్‌లో ఏవో ఆంథోనీకి వినతిపత్రం అందజేశారు. మెదక్ జిల్లాకేంద్రంలో తపస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలోనల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు.



తూప్రాన్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

ముత్తంగిలో భూదాన్ కబ్జాకు యత్నం

పటాన్‌చెరు/ పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 23 : ముత్తంగిలో భూదాన్ కబ్జాకు ప్రయత్నించిన వారి ఆగడాలకు అడ్డుకట్ట పడింది. ముత్తంగి 521 సర్వే నంబర్‌లో 5 ఎకరాల భూదాన్ భూమి ఉంది. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఈ భూమి చుట్టూ కడీలు వేయడంతో పలువురు స్థానికులు ముత్తంగి మాజీ ఎంపీటీసీ కుమార్ గౌడ్‌కు విషయాన్ని తెలిపారు. కుమార్‌గౌడ్ వెంటనే పటాన్‌చెరు తహసీల్దారుకు సమాచారమందించారు. ఈ మేరకు తహసీల్దార్ శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని కడీలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు.